సాక్షి
పార్వతీపురం మన్యం

గురువారం । 14 । సెప్టెంబర్ । 2023



విద్యార్థుల క్రీడా సందడి

పాఠశాలల్లో క్రీడా సందడి ప్రారంభమైంది. 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆటల్లో నిమగ్నమయ్యారు. - 8లో



చేపతో దోమకు చెక్..!

ప్రజలను పట్టిపీడిస్తున్న మలేరియా వ్యాధికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. - 8లో



కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు

ఆహార కల్తీకి పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వై.రామయ్య హెచ్చరించారు. - 8లో

న్యూస్‌రీల్

గిరిజన సంక్షేమశాఖ డీడీగా మంగవేణి

సీతంపేట: గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా సీతంపేట ఏటీడబ్ల్యూఓ జి.మంగవేణికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆమె బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు మందస ఏటీడబ్ల్యూఓ శ్రీనివాసరావు ఎఫ్ఏసీగా బాధ్యతలు నిర్వర్తించారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'కు సర్వం సిద్ధం

పార్వతీపురం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశామని కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా కలెక్టర్లతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై బుధవారం వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ఈ నెల 30వ తేదీ నుంచి పక్కాగా నిర్వహించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. వీడియోకాన్ఫరెన్స్‌లో జేసీ ఆర్.గోవిందరావు, పార్వతీపురం ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, డీఆర్వో జె.వెంకటరావు, డీఎంహెచ్ఓ డాక్టర్ బి.జగన్నాథరావు, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డా.బి.వాగ్దేవి తదితరులు పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్‌కు బదిలీ

పాలకొండ: పాలకొండ సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్‌కు శ్రీకాకుళం జిల్లా టెక్కలి సబ్ కలెక్టర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వుల కాపీ ఆయనకు బుధవారం అందింది. పాలకొండ సబ్‌కలెక్టర్‌గా ఇంకా ఎవరినీ నియమించలేదు.

పర్యాటక అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం టౌన్: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర పర్యాటక శాఖ అందజేయనున్న అవార్డులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎన్.నారాయణరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యాటక రంగంలో విశిష్ట సేవలు అందించిన వారికి పోటీలు నిర్వహించి అవార్డులను ప్రదానం చేయనున్నట్టు ఆయన చెప్పారు. ఔత్సాహికులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టూరిజం.జీఓవీ.ఇన్ వెబ్ సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ఈ నెల 19వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్‌లో సమర్పించాలని కోరారు. ఎంపిక చేసిన వారికి పర్యాటక దినోత్సవం సందర్భంగా అవార్డులు అందజేస్తామని తెలిపారు.

15న 'హెల్త్‌గ్రీవెన్స్'

విజయనగరం అర్బన్: వైద్య పరమైన సహాయం, సీఎం సహాయ నిధి కోసం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి విజ్ఞప్తి చేయడానికి జేఎన్‌టీయూ కూడలి సమీపంలోని హెలిప్యాడ్ బయట కౌంటర్ ఏర్పాటు చేస్తున్నట్టు కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన రోజు (ఈ నెల 15న) తమ ఆరోగ్యపరమైన వినతులను ప్రత్యే కౌంటర్ వద్ద అందజేయాలని సూచించారు.

పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణకు ప్రతిపాదనలు



రాజకీయ పార్టీ ప్రతినిధుల సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

పార్వతీపురం: పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ కోసం సెప్టెంబర్ 23 తేదీ నాటికి ప్రతిపాదనలు అందించాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు పునశ్చరణ కార్యక్రమం, పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణపై కలెక్టర్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త ఈవీఎం మిషన్ల స్కానింగ్ సెప్టెంబర్ 14, 15 తేదీల్లో జరుగుతుందని తెలిపారు. సెప్టెంబర్ 20 తేదీ నుంచి ఈవీఎంలను పరీక్షిస్తామని, సంబంధిత రాజకీయ పార్టీల ప్రతినిధులందరూ సహకరించాలని కోరారు. అక్టోబర్ 1వ తేదీ నుంచి ఈవీఎమ్‌లు, వీవీపీఏటీఎస్ మొదటి స్థాయి తనిఖీ (ఎఫ్ఎల్‌సీ) జరుగుతుందని తెలిపారు. పాచిపెంట మండలం కొండమోసూరు గ్రామంలో కొత్త పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటుకు అనుకూలతలపై నివేదిక అందజేయాలని ఎన్నికల అధికారులకు సూచించారు. జిల్లాలో అన్ని రకాల ఫారాలకు సంబంధించిన దరఖాస్తులు 1,07,533 అందగా అందులో పాలకొండ నియోజకవర్గానివి 37,386, కురుపాం-30,738, పార్వతీపురం-16387, సాలూరు నియోజకవర్గానికి సంబంధించినవి 23,022 ఉన్నట్టు వెల్లడించారు. వీటిలో 1445 తిరస్కరించగా, 3,115 అంగీకరించామని, 64,365 మంది పేర్లను ఓటరు జాబితాలో చేర్చామని, 38,608 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్టు వివరించారు.

ప్రభుత్వ మెడికల్ కాలేజీ.. ప్రజల ఆకాంక్ష

- కార్యసాధకుడు సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి
- 15న సీఎం పర్యటనను విజయవంతం చేయండి
- జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రభుత్వ వైద్య కళాశాల ప్రత్యేకతలిలా...

శంకుస్థాపన: 31.05.2021
ప్రారంభోత్సవం: 15.09.2023
విస్తీర్ణం:70 ఎకరాలు (గాజులరేగ సర్వే నెం. 1/89)
భవనాల నిర్మిత ప్రాంతం: 13,99,879 చదరపు అడుగులు
తొలి దశలో పూర్తి చేసిన విస్తీర్ణం: 1,50,000 చదరపు అడుగులు
మొత్తం అంచనా వ్యయం: రూ.500 కోట్లు
తొలి దశలో ఇప్పటివరకూ ఖర్చు: రూ.99 కోట్లు
బోధనాస్పత్రి విస్తీర్ణం: 6,61,954 చ.అడుగులు
సర్వీసు బ్లాక్: 26,376 చదరపు అడుగులు
పడకల ఏర్పాటు: 500
ఎంబీబీఎస్ సీట్లు: 150
ఇప్పటివరకు చేరిన విద్యార్థుల సంఖ్య: 114
బోధన, బోధనేతర సిబ్బంది: 222 మంది
ఇప్పటివరకు భర్తీ చేసిన పోస్టులు: 150

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఉమ్మడి విజయనగరం ప్రజల చిరకాల ఆకాంక్ష ప్రభుత్వ మెడికల్ కాలేజీ కార్యసాధకుడిగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అభిప్రాయపడ్డారు. ఈనెల 15వ తేదీన ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సాక్షికి ప్రత్యేకంగా ఇంట ర్వ్యూ ఇచ్చారు. ఆయన మాటల్లోనే...

''నిరుపేదలైన బీసీ సామాజిక వర్గాలు, హరిజనులు, గిరిజనులు ఎక్కువగా ఉన్న ప్రాంతమిది. సూపర్ స్పెషాలిటీ వైద్యం కోసం విశాఖలోని కేజీహెచ్, ఇతర ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులే దిక్కు. అత్యవసర పరిస్థితుల్లో, విశాఖకు వెళ్తున్నప్పుడు మార్గమాధ్యలో ప్రాణాలు పోతున్నాయనే ఆవేదన జిల్లా ప్రజల్లో దశాబ్దాలుగా గూడుకట్టుకొని ఉంది. విజయనగరంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తామని గతంలో చంద్రబాబు ఎన్నికల సమయంలో, తర్వాత అసెంబ్లీలోనూ హామీ ఇచ్చారు. కేవలం జీఓ ఇచ్చి ఈ ప్రాంత ప్రజలను మోసం చేశారు.



చేతులెత్తేసిన అశోక్...

మాన్సాస్ ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీ పెడతామంటూ ఆనంద గజపతిరాజు ఒక ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. తర్వాత మాన్సాస్ చైర్మన్ పదవి చేపట్టిన అశోక్ గజపతిరాజు చేతులెత్తేశారు. అప్పట్లో కేంద్ర మంత్రి పదవిలో ఉంటూ తాము మెడికల్ కాలేజీ పెట్టలేమంటూ ప్రభుత్వానికి లేఖ రాశారంటే వారి చిత్తశుద్ధి ఎంతో గ్రహించవచ్చు.

అమ్మవారి సాక్షిగా హామీ...

ప్రజాసంకల్పయాత్రలో భాగంగా విజయనగరంలోని పైడితల్లి అమ్మవారి సాక్షిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇచ్చారు. అధికారంలోకి రాగానే కార్యరూపంలోకి తీసుకొచ్చారు. రూ.500 కోట్ల వ్యయంతో దాదాపు 70 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు. ఈ కళాశాలకు రెండేళ్ల క్రితం శంకుస్థాపన చేసిన ఆయనే ఈ నెల 15న ప్రారంభోత్సవం చేస్తుండడం విశేషం.

వైద్య రంగాన్ని సంస్కరించిన సీఎం...

వైద్యో నారాయణ హరి అనేది నానుడి. వైద్యుడిని దైవంతో సమానంగా చూస్తాం. అలాంటి ఎంతోమంది వైద్యులను, ఆధునిక వైద్యాలయాన్ని మన కు అందించిన వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కూడా దైవంతో సమానంగా చూస్తున్నాం. విద్య, వైద్యం అందరికీ అందించాలనే లక్ష్యంతో నాడు- నేడు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు కొత్త రూపం తెచ్చారు. పీహెచ్‌సీలను, సీహెచ్‌సీలను బాగుచేశారు. వైద్యులు, సిబ్బంది పోస్టులన్నీ భర్తీ చేశారు. ఇప్పుడు ఒక్కో పీహెచ్‌సీలో 14 మంది చొప్పున సేవలందిస్తున్నారంటే ఎంతగా బాగు చేశారో అర్థమవుతోంది. ఆధునిక పరికరాలతో కూడిన కొత్త 108 అంబులెన్స్‌లను అందుబాటులోకి తెచ్చారు. వైద్యులే 104 వాహనాల ద్వారా ప్రతి గ్రామానికీ, ప్రతి గడపకూ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిని వాకబు చేస్తూ అవసరమైన మందులు ఇచ్చేలా ఫ్యామిలీ ఫిజీషియన్ విధానాన్ని తెరపైకి తెచ్చారు. ఎలాంటి జబ్బు చేసినా వైద్యం పొందేలా ఆరోగ్యశ్రీ పథకంలో మార్పులు చేశారు. ఇక జగనన్న సురక్ష పేరుతో ప్రతి పీహెచ్‌సీ పరిధిలో వలంటీర్లు ప్రజల ఇళ్లకు వెళ్లి ఎవరికి ఏ రకమైన వైద్యం అవసరమో గుర్తించే కార్యక్రమాన్నీ ప్రభుత్వం ప్రారంభించింది. ఆ ప్రకారం వైద్యులు వచ్చి వారికి వైద్య పరీక్షలు చేస్తారు. అవసరమైన మందులు ఇస్తారు.

సీఎం పర్యటన విజయవంతం చేయాలి...

కరోనా మహమ్మారి విజృంభించినప్పుడు సకాలంలో వైద్య పరీక్షలు, వైద్యసేవల ద్వారా రాష్ట్రంలో ప్రాణనష్టాన్ని కనిష్ట స్థాయిలో ఉంచడానికి ముఖ్యమంత్రి చేసిన కృషి ఏమిటో మనమంతా చూశాం. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను సాకారం చేస్తున్నారు. విజయనగరం మెడికల్ కాలేజీ నుంచే ఏటా 150 మంది ఎంబీబీఎస్ పట్టభద్రులు సమాజంలోకి వస్తారు. ఇంతలా వైద్య రంగం తీరుతెన్నులను మార్చేసిన జగన్‌మోహన్‌రెడ్డి విజయనగరం పర్యటనను విజయవంతం చేయాలి. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులతో పాటు ప్రజలు కదిలిరావాలి.''



ప్రారంభానికి ముస్తాబైన విజయనగరం ప్రభుత్వ మెడికల్ కాలేజీ

15న సీఎం పర్యటన ఇలా...

ఉదయం 9:50: గన్నవరం విమానాశ్రయం నుంచి విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుంటారు
10:30 : విశాఖ విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో విజయనగరం శివారు ద్వారపూడి గ్రామ పరిధిలోని జేఎన్‌టీయూ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
10:30-10:40: ప్రజాప్రతినిధులతో మాటామంతీ
10:45: రోడ్డు మార్గంలో కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రాంగణానికి చేరుకుంటారు
10:50: మెడికల్ కాలేజీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ విగ్రహం ఆవిష్కరణ
10:55: కొత్తగా నిర్మించిన విజయనగరం మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవం
10:55: ఫొటో ఎగ్జిబిషన్ సందర్శన
11:05: స్కిల్ ల్యాబ్ పరిశీలన
11:15: బయోకెమిస్ట్రీ ల్యాబ్ సందర్శన
11:20: అనాటమీ మ్యూజియం పరిశీలన
11:30: లెక్చర్ హాల్‌కు సీఎం రాక
11:40: రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాలలో కొత్తగా నిర్మించిన నాలుగు ప్రభుత్వ మెడికల్ కాలేజీలను వర్చువల్‌గా ప్రారంభిస్తారు.
11:50 – 12 గంటలు: ముఖ్య అతిథుల ప్రసంగం
12 నుంచి 12:20: ముఖ్యమంత్రి ప్రసంగం
12:20: విజయనగరం సహా మిగతా నాలుగు మెడికల్ కాలేజీల విద్యార్థులతో సంభాషిస్తారు
12:55-1:25: స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడతారు
1:30: జేఎన్‌టీయూ రోడ్డులోని హెలిప్యాడ్ నుంచి హెలికాప్టర్‌లో తిరుగు ప్రయాణమవుతారు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

సీఎం పర్యటనకు శరవేగంగా ఏర్పాట్లు...

ముఖ్యమంత్రి పర్యటనకు శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రభుత్వ మెడికల్ కాలేజీ, హెలిప్యాడ్ వద్ద ఏర్పాట్లను బుధవారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పరిశీలించారు. మరోవైపు జిల్లా కలెక్టరు నాగలక్ష్మి, ఎస్పీ దీపిక, జాయింట్ కలెక్టర్‌మయూర్ అశోక్, ఆర్డీఓ సూర్యకళ తదితర ఉన్నతాధికారులు ఈ ఏర్పాట్లలో తలమునకలై ఉన్నారు.

జగనన్నతోనే గిరిజన గ్రామాల అభివృద్ధి

- అడారుగెడ్డపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.6 కోట్లు మంజూరు
- బాగుజోల నుంచి సిరివర వరకు రూ.11కోట్ల ఖర్చుతో రోడ్డు నిర్మాణం
- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



శిథిలావస్థకు చేరిన అడారుగెడ్డ కాజ్‌వేను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

మక్కువ: గత నాలుగేళ్లుగా గిరిజన గ్రామాలు ప్రగతి పథంలో పయనించేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కృషే కారణమని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. గిరిజన గ్రామాల ప్రజల రాకపోకలకు వీలుగా కోట్లాది రూపాయల ఖర్చుతో బ్రిడ్జిలు, రోడ్లు నిర్మిస్తున్నట్టు వెల్లడించారు. మక్కువ మండలం దుగ్గేరు గ్రామసమీపంలో అడారుగెడ్డపై శిథిలావస్థకు చేరుకున్న కాజ్‌వేను బుధవారం ఆయన పరిశీలించారు. ఇక్కడ కొత్తగా బ్రిడ్జి నిర్మాణానికి సుమారు రూ.6 కోట్లు మంజూరైనట్టు తెలిపారు. మక్కువ, సాలూరు మండలాల్లోని గిరిశిఖర గ్రామాలైన బాగుజోల నుంచి సిరివర వరకు రోడ్డు నిర్మాణానికి రూ.15 కోట్లతో ప్రతిపాదనలు పంపించగా రూ.11 కోట్లు మంజూరైనట్టు వెల్లడించారు. పనులు త్వరగా ప్రారంభించాలని పీఆర్ డీఈ శర్మకు సూచించారు. గతంలో టీడీపీ నాయ కులు అడారుగెడ్డపై మోకాళ్లలోతులో దిగి ఫొటోలుకు ఫోజులిచ్చారే తప్ప నిధులు మాత్రం మంజూరుచేయలేకపోయారన్నారు. వర్షాకాలంలో ఆడారుగెడ్డ ఉగ్రరూపం దాల్చుతుండడంతో తరచూ గిరిజన ప్రజల రాకపోకలకు అంతరాయం కలుగుతోందని, దీనిని గుర్తించి బ్రిడ్జి నిర్మాణానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. అడారుగెడ్డపై బ్రిడ్జి నిర్మాణ విషయాన్ని జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడులు తెలియజేయగా, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్టు వివరించారు. మక్కువ, సాలూరు మండలాల్లోని గిరిశిఖర గ్రామాలకు చెందిన గిరిజనుల కల కొద్ది రోజుల్లో సాకారమవుతుందని తెలిపారు.

టెండర్ల పరిశీలన

పార్వతీపురం: ఏపీ సాంఘిక సంక్షేమ గురుకులాల టెండర్లను జేసీ ఆర్.గోవిందరావు బుధవారం పరిశీలించారు. జోగింపేట, సాలూరు బాలుర గురుకులాలు, భామిని, గరుగుబిల్లి బాలికల గురుకులాలకు కూరగాయలు, ఉల్లి, వెల్లుల్లి, అల్లం, గుడ్లు, కోడి మాంసం, పండ్లు, పాలు సరఫరా చేసేందుకు సెప్టెంబర్ 2 నుంచి 13వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించారు. ఈ మేరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆయా సరుకుల సరఫరాకు కొనుగోలు కమిటీ ఆమోదం తెలిపిందన్నారు.



టెండర్లను పరిశీలిస్తున్న జేసీ గోవిందరావు

నలుగురితో శాలివాహన సంక్షేమ కమిటీ

విజయనగరం అర్బన్: జిల్లాలో నలుగురు సభ్యులతో కుమ్మరి, శాలివాహన సంక్షేమ కమిటీ ఏర్పాటైనట్లు ఆ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మండేపూడి పురుషోత్తం తెలిపారు. కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటయ్యే అధికారిక కమిటీలో అధికారులతో పాటు గుర్ల మండలం కోటగండ్రేడుకు చెందిన ఉబ్బిశెట్టి అప్పలస్వామి, లక్కవరపుకోట మండలం రంగరాయపురానికి చెందిన స్వయంబారకు కనకారావు, విజయనగరంలోని దాసన్నపేటకు చెందిన దొండిగల్లు పాపారావు, గజపతినగరం మండలం లోగిశకు చెందిన అరటి లక్ష్మిలను సభ్యులుగా నియమిస్తూ కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ప్రకటించారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఏపీ శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పురుషోత్తం బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్పొరేషన్ ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు.



విజయనగరం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మిని అభినందిస్తున్న కుమ్మరి, శాలివాహన సంక్షేమ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మండేపూడి పురుషోత్తం, తదితరులు

కొత్తకొత్తగా సాగుదాం..



- ఆధునిక పద్ధతుల్లో సాగుబాట
- ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం
- మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటల సాగు
- ప్రభుత్వ రాయితీలు అందిపుచ్చుకుంటూ ముందుకు..
- రైతులకు ఆదర్శంగా నిలుస్తున్న పట్టభద్రులు

వారంతా డిగ్రీ.. ఆ పై చదువులు చదువుకున్న విద్యావంతులు. అయితేనేం.. పూర్వీకుల నుంచి వస్తున్న వ్యవసాయమంటే మక్కువ. పుడమితల్లిని పరిరక్షిస్తూ.. ఆధునిక పద్ధతుల్లో.. లాభదాయక పంటలు సాగుచేస్తున్నారు. ప్రభుత్వ రాయితీలను అందిపుచ్చుకుంటున్నారు. రైతన్నలకు కొత్త సాగుమార్గాలను చూపిస్తున్నారు. 'భూమిని నమ్ముకున్న వాడు ఎన్నటికీ చెడిపోడు' అన్న సత్యాన్ని రుజువు చేస్తున్నారు. ఆరోగ్యకర పంటలు సాగుచేస్తూ.. ఆదర్శంగా నిలుస్తున్న ఉమ్మడి విజయనగరం జిల్లాలోని కొందరు పట్టభద్రులైన రైతన్నల సాగుపథానికి 'సాక్షి' అక్షరరూపం. – విజయనగరం డెస్క్



చిత్రంలో తాను సాగుచేసిన డ్రాగన్ ఫ్రూట్స్‌తోట వద్ద ఉన్న యువరైతు పేరు దూబ రమేష్‌బాబు. విజయనగరం జిల్లా రేగిడిమండలంలోని కాగితాపల్లి గ్రామం. బీకామ్ చదువుకున్న ఈయన తనకున్న ఆరు ఎకరాల్లో పంటల సాగుచేపట్టారు. మూడు ఎకరాల్లో డ్రాగన్‌ఫ్రూట్స్, మరో రెండు ఎకరాల్లో జామ, మరో ఎకరా విస్తీర్ణంలో పొటాటో సాగుచేస్తున్నారు. ప్రభుత్వం 50 శాతం రాయితీపై సమకూర్చిన డ్రిప్ ఇరిగేషన్‌తో సేంద్రియ వ్యవసాయం చేస్తున్నారు. సమీకృత వ్యవసాయ విధానం అమలుచేస్తూ అక్కడే జీవాల పెంపకం యూనిట్‌ను కూడా నిర్వహిస్తున్నారు. ఏడాదికి రూ.10 లక్షల వరకు ఆదాయం పొందుతున్నారు.

ఆసక్తితో సాగుచేస్తే లాభాలే..

వ్యవసాయం చాలా మంచి ఉపాధి మార్గం. అవగాహనతో, ఆసక్తితో చేస్తే మంచి లాభాలు వస్తాయి. సాగులో భిన్నంగా ఆలోచించాలి. నేను మా కుటుంబానికి చెందిన ఆరు ఎకరాల బంజరు భూమి లాంటి ప్రాంతాన్ని సాగులోకి తెచ్చాను. ప్రారంభంలో కాస్త ఒడిదుడుకులు ఎదురైనా ఇప్పుడు మంచి ఫలితాలు వస్తున్నాయి. మూడేళ్ల దాటి డ్రాగన్, తైవాన్ జామతోటలు సాగుచేస్తున్నాను. ఏటా లాభాలు కనిపిస్తున్నాయి. సాగులో మమేకం కావడం సంతోషాన్ని ఇస్తోంది. – దూబ రమేష్ బాబు, యువరైతు, కాగితాపల్లి, రేగిడి మండలం



తెల్లని పంచె, లాలీ ౖతో సాగులో నిమగ్నమైన పట్టభద్రుడైన రైతు పేరు దార్లపూడి రవి. రేగిడి మండలం ఉంగరాడ. ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లో పీజీ చేసిన ఈయన సాగుపై మమకారంతో స్వగ్రామానికి చేరుకున్నారు. గ్రామానికి పక్కనే ఉన్న గుళ్లపాడు వద్ద ఉన్న ఆరు ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం విధానంలో పంటలు సాగుచేస్తున్నారు. నాలుగు ఎకరాల్లో వరి (కాళ్లాబట్ట, రత్నచోడి, చింతలూరి సన్నాలు, చిట్టి ముత్యాలు వంటి 12 రకాల వరి వంగడాలు), రెండు ఎకరాల్లో మామిడి తోటలు వేసి అందులో అంతర పంటలుగా కొర్రలు, రాగులు, సామలు, వంటి చిరుధాన్యాలు, అటవీ ప్రాంతాల్లో పండే మొక్కజొన్న, దుంపజాతి కూరగాయలు, ఏడు రకాల చిక్కుడు పంటలు, రెడ్ సీతాఫలం వంటి పంటలు సాగుచేస్తున్నారు. గో ఆధారిత వ్యవసాయం చేస్తున్నారు. పంటలను ఆశించే చీడపీడల నివారణకు సొంతంగా తయారుచేసిన జీవామృతాలు, కషాయాలు, పులియబెట్టిన ద్రావణాలు వినియోగిస్తున్నారు. ఆరోగ్యకర పంటలు సాగు చేస్తున్నారు. ఏడాదికి రూ.3 లక్షల వరకు ఆదాయం సంపాదిస్తున్నారు. ఈయన సాగుచేసిన పంటల్లో ఎక్కువ భాగం విత్తనాల రూపంలోనే అమ్మకాలు సాగుతుండడం గమనార్హం.

ఆరోగ్యంగా జీవించేందుకే...

ఎరువుల వినియోగించకుండా పండించిన ఆహారం తీసుకుంటేనే కొన్నాళ్లపాటైనా ఆరోగ్యంగా బతకగలం. ఇది మన పూర్వీకులు మనకు నేర్పారు. ప్రస్తుతం అధిక దిగుబడుల సాధనలో రసాయనిక ఎరువులను మోతాదుకుమించి వినియోగిస్తున్నాం. అనారోగ్యాన్ని కొనితెచ్చుకుంటున్నాం. అందుకే ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాను. గుళ్లపాడు వద్ద ఉన్న ఆరెకరాల వ్యవసాయ భూమిలో ఐదేళ్లుగా ప్రకృతి సాగుపద్ధతుల్లో పంటలు సాగుచేస్తున్నాను. ఆరోగ్యకర ఆహారాన్ని ఉత్పత్తి చేస్తున్నా. వీటికి మార్కెట్‌లో మంచి డిమాండ్‌తో పేరు వచ్చింది. నా వ్యవసాయ పద్ధతులు నచ్చి బెంగుళూరులోని శ్రీశ్రీ రవిశంకర్ ఆశ్రమంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ నేచురల్ ఫార్మింగ్ టీచర్ కోఆర్డినేటర్‌గా ఎంపిక చేశారు. చదువుకున్న యువ రైతులు వ్యవసాయంపై దృష్టిపెట్టాలి. మంచి ఆదాయం సంపాదించాలి. శ్రద్ధ చూపితే బంజరు భూముల్లో బంగారు పంటలు పండించవచ్చు. – దార్లపూడి రవి, యువరైతు, ఉంగరాడ, రేగిడి మండలం

లాభదాయక సాగు



చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తిపేరు మహంతి అప్పలనాయుడు. ఆయనది పూసపాటిరేగ మండల కేంద్రం. తనకున్న ఐదు ఎకరాల్లో ఆధునిక పద్ధతుల్లో సేంద్రియ వ్యవసాయం చేస్తున్నారు. బీర, బెండ, అరటి, సొరకాయ, కరుబుజ్జి తదితర పంటలు సాగుచేస్తున్నారు. ఏడాది పొడవు నా ఆదాయం వచ్చేలా కూరగాయల పంటలు సాగుచేస్తున్నారు. ఏడాదికి ఖర్చులన్నీ పోయి రూ.5లక్షల ఆదాయం మిగులుతోందని తెలిపారు. సొంత ట్రాక్టర్ ఉండడంతో సాగు సులభమైందని, చదువుకున్న వారు కొత్తగా ఆలోచించి పంటలు సాగుచేస్తే ఉన్న ఊరిలోనే ఉపాధి పొందవచ్చని సెలవిచ్చారు.

ప్రయోగాత్మకంగా..



నేను డిగ్రీ చదువుకున్నాను. ఎస్.కోట మండలం బొడ్డవర గ్రామ సమీపంలో తొలి సారిగా ఎకరా విస్తీర్ణంలో డ్రాగన్‌ఫ్రూట్ సాగు చేశాను. పంట ఆశాజనకంగా ఎదుగుతోంది. ఉద్యానవన శాఖ సూచనలు, సలహాలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ రాయితీలు అందుతున్నాయి. – ఆదారి నాగేశ్వర, రైతు.ఎస్.కోట



ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంటలను ప్రదర్శిస్తున్న రైతు దార్లపూడి రవి

వ్యవసాయం ఆరోగ్యదాయకం



వ్యవసాయం మన జీవన విధానంలో ఓ భాగం. దానిని ఎన్నడూ విడిచిపెట్టకూడదు. డైట్ సీనియర్ లెక్చరర్‌గా పనిచేసి రిటైర్ అయ్యాను. అప్పటి నుంచి పామాయిల్, అరటి, వరి పంటను సుమారు 25 ఎకరాల్లో సాగుచేస్తున్నాను. చదువుకున్న యువ రైతులు సాగుబాట పడితే ఆరోగ్యకర పంటలు ప్రజలకు అందుతాయి. ఆరోగ్యకర సమాజం ఏర్పడుతుంది. – బడే అప్పలనాయుడు, డైట్ విశ్రాంత లెక్చరర్, వెంకటరాజుపురం, జియ్యమ్మవలస

క్లుప్తంగా

నాక్‌కు సన్నద్ధం కావాలి

- సెంచూరియన్ వైస్‌ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డీఎన్ రావు



సమావేశంలో మాట్లాడుతున్న సెంచూరియన్ వర్సిటీ వైస్ ప్రెసిడెంట్ డీఎన్‌రావు

నెల్లిమర్ల రూరల్: సెంచూరియన్ విశ్వవిద్యాలయం నాక్‌కు సన్నద్ధం కావాలని వర్సిటీ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డీఎన్ రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని టెక్కలి సెంచూరియన్ వర్సిటీలో సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాక్ నిబంధనల మేరకు బోధన పద్ధతులను అవలంబించాలని సూచించారు. యూజీసీ గుర్తింపు పొందిన మ్యాగజైన్లలో వ్యాసాలు ప్రచురితమయ్యే విధంగా కృషి చేయాలని చెప్పారు. సీఎస్ఆర్ కార్యక్రమాలను ఎక్కువగా చేపట్టాలని, పేటెంట్స్ పొందడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ పీకే మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డీన్‌లు ఎస్వీ రమణారావు, సన్నీడియోల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

15న ఎంప్లాయిస్ గ్రీవెన్స్‌డే

పార్వతీపురం: ఎంప్లాయిస్ గ్రీవెన్స్‌డే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిషాంత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు వ్యక్తిగత ఫిర్యాదులతో సహా ఏరకమైన ఫిర్యాదులైనా సమర్పించవచ్చునని, ఫిర్యాదులను జగనన్నకు చెబుదాం పోర్టల్‌లో ప్రత్యేక ఐడీలతో నమోదు చేస్తామని పేర్కొన్నారు.

ఆయుష్మాన్ భవ పోస్టర్ విడుదల



ఆయుష్మాన్‌భవ పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురం: ఆయుష్మాన్ భవ పోస్టర్‌ను పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ బుధవారం తన కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుష్మాన్‌భవ పక్షోత్సవాలు ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు జరుగుతాయన్నారు. ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని ఆరోగ్యకరమైన భారత్–సామర్థ్యం గల భారత్ అనే నినాదంతో చేపట్టనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అందరికీ ఆయుష్మాన్ కార్డులు పంపిణీ చేస్తారని, ప్రతివారం ఆరోగ్యమేళాను గ్రామాల్లో గల వెల్‌నెస్ కేంద్రాల్లోను, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలోను, వైద్య కళాశాలల్లోను వైద్య ఆరోగ్య నిపుణులతో ఏర్పాటు చేసి వైద్యపరీక్షలు నిర్వహిస్తారన్నారన్నారు. అక్టోబర్ 2నుంచి గ్రామాల్లో, పట్టణాల్లో వార్డుల వారీగా శానిటేషన్, న్యూట్రిషన్ కమిటీ సమావేశం జరుగుతుందని తెలిపారు. స్వచ్ఛంద రక్తదాన శిబిరాలపై అవగాహన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. గ్రామస్థాయి నుంచి పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో జేసీ ఆర్.గోవిందరావు, ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్, డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు, జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి బి.వాగ్దేవి, ప్రోగ్రాం అధికారి ఎం.వినోద్ తదితరులున్నారు.

ఆటోను ఢీకొన్న గుర్తు తెలియని వాహనం

- ఏడుగురికి గాయాలు



గాయపడిన వారిని 108లో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

మెంటాడ (గజపతినగరం రూరల్): మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఆటోను ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురు గాయపడ్డారు. వారిలో బొడ్డల సుగుణ, సోమిరెడ్డి కన్నం నాయుడులు తీవ్రంగా గాయపడడంతో సుగుణను విశాఖలోని కేజీహెచ్‌కు, కన్నం నాయుడిని జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మిగిలిన క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. కూరగాయలు అమ్ముకునేందుకు దత్తిరాజేరు మండలం పెదకాద గ్రామం నుంచి ఆటోలో గజపతినగరం వచ్చిన వారిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ప్రమాదం జరిగింది.

విద్యార్థుల క్రీడా సందడి

- స్కూల్‌గేమ్స్ పోటీల నిర్వహణకు కార్యాచరణ
- ఈనెల 14, 15 తేదీల్లో కార్పొరేషన్ పరిధిలో పాఠశాలల విద్యార్థులకు
- 16న మండల పరిధి పాఠశాలల విద్యార్థులకు పోటీలు
- 20న నియోజకవర్గ స్థాయి పోటీలు



క్రీడల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

విజయనగరం: పాఠశాల విద్యార్థుల క్రీడా సందడి ప్రారంభమైంది. 6వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ప్రతి ఏడాది ప్రభుత్వం నిర్వహించే స్కూల్ గేమ్స్ క్రీడాకారుల ఎంపిక పోటీలకు సంబంధించి విజయనగరం నియోజకవర్గ స్థాయిలో తేదీలు ఖరారయ్యాయి. అండర్–14,17 వయస్సుల విభాగాల్లో ఈ క్రీడా పోటీలు జరగనున్నాయి. మొత్తం 9 క్రీడాంశాల్లో నిర్వహించే ఎంపిక పోటీల్లో భాగంగా నియోజకవర్గానికి సంబంధించి ఈనెల 14,15 తేదీల్లో రెండు రోజుల పాటు విజయనగరం కార్పొరేషన్‌పరిధిలో గల విద్యార్థులకు పోటీలు నిర్వహించనుండగా..16న మండల పరిధిలో గల పాఠశాలల విద్యార్థులకు క్రీడాపోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ఈనెల 20న నియోజకవర్గ స్థాయిలో పోటీలు నిర్వహించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణను నియోజకవర్గ స్థాయి స్కూల్‌గేమ్స్ అసోసియేషన్ ఇన్‌చార్జ్ ప్రకటించి..అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చని స్పష్టం చేశారు.

రాజీవ్ క్రీడామైదానం వేదికగా..

పట్టణ, మండల, నియోజకవర్గ స్థాయిల్లో విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని రాజీవ్ క్రీడామైదానం వేదికగా స్కూల్‌గేమ్స్ క్రీడాకారుల పోటీలు నిర్వహించేందుకు నిర్ణయించారు. నిర్ణీత తేదీల్లో ఉదయం 8.30 గంటలలోగా ఆయా క్రీడాంశాల్లో పోటీ పడే అభ్యర్థులు హాజరుకావాల్సి ఉంటుంది. నియోజకవర్గం పరిధిలో పట్టణ పరిధి ఎక్కువగా ఉండడంతో ఈనెల 14,15 తేదీల్లో రెండు రోజుల పాటు పోటీలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 14న వాలీబాల్, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో పోటీలు జరగనున్నాయి. 15న ఖోఖో, త్రోబాల్,టెన్నికాయిట్, యోగా క్రీడాంశాల్లో పోటీలు జరుగుతాయి. అలాగే 16న మండల పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు అన్ని క్రీడాంశాల్లో ఒకే రోజు పోటీలు నిర్వహించి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు.

పోటీలను విజయవంతం చేయాలి

ప్రతి ఏడాది పాఠశాల విద్యార్థులకు నిర్వహించే స్కూల్ గేమ్స్ క్రీడాపోటీల నిర్వహణకు సమయం ఆసన్నమైంది. విద్యాశాఖ ఆదేశాల మేరకు ఈనెల 14 నుంచి 20వ తేదీలోగా మండల, పట్టణ, నియోజకవర్గ స్థాయిల్లో 9 క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేశాం. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, త్రోబాల్, టెన్ని కాయిట్, యోగా, అథ్లెటిక్స్ క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నాం. నియోజకవర్గం పరిధిలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొని ప్రతిభను నిరూపించుకోవచ్చు.

సంజీవరావు, ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, విజయనగరం

చేపతో దోమకు చెక్..!



విజయనగరంలోని ఫోర్ట్‌సిటీ స్కూల్ వద్ద ఉన్న చెరువులో గంబుషియా ఫిష్ వదులుతున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు, డీఎంఓ మణి

- గంబూషియాతో మలేరియా దూరం
- చర్యలు చేపట్టిన వైద్యాధికారులు

విజయనగరం ఫోర్ట్: ప్రజలను పట్టిపీడిస్తున్న మలేరియా వ్యాధికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. ఈ మేరకు మలేరియా వ్యాధికి కారణమయ్యే దోమలు వృద్ధి చెందకుండా మొగ్గలోనే తుంచేయాలని నిర్ణయించి ఆ దిశగా చర్యలు చేపట్టింది.

చెరువుల్లో గంబుషియా ఫిష్

మలేరియా వ్యాధికి గంబూషియా ఫిష్‌తో చెక్ పెట్టనున్నారు. నీరు పారే ప్రాంతాల్లోను, నీరు నిల్వ ఉన్న చోట ఈఫిష్‌ను వదులుతారు. మలేరియా కలగజేసే అనాఫిలిస్ దోమలకు చెందిన లార్వాలను గంబూషియా ఫిష్ తినేస్తుంది. తద్వారా దోమల వృద్ధి ఆగిపోతుంది. ఫలితంగా వ్యాధి వ్యాప్తి తగ్గిపోతుంది.

జిల్లాలో 2.56 లక్షల ఫిష్

జిల్లాలోని పలు గ్రామాల్లో గల చెరువుల్లో గంబూషియా ఫిష్‌ను వైద్యాధికారులు వదిలిపెట్టనున్నారు. ఈ మేరకు 956 గ్రామాల్లో 2.56 లక్షల గంబూషియా ఫిష్ వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.



బొబ్బిలి మండలంలోని చెరువులో గంబూషియా ఫిష్ వదులుతున్న వైద్యసిబ్బంది

ప్రతిశుక్రవారం డ్రైడే పాటించాలి

ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని చెబుతున్నాం. దోమలు పెరగడానికి ఆస్కారం ఉన్న ప్రాంతాలను గుర్తించేందుకు వెక్టర్ కంట్రోల్‌ఐజిన్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చాం. ఎక్కడైతే చెత్తాచెదారం పేరుకుపోయినట్లు కనిపిస్తుందో అప్రాంతాన్ని ఫొటో తీసి యాప్‌లో నమోదు చేస్తాం. అది సంబంధిత పంచాయతీ సెక్రటరీకి పంపిస్తాం. వెంటనే నివారణ చర్యలు తీసుకుంటాం. ఈఏడాది మలేరియాను కలగజేసే దోమలను నివారించేందుకు గంబూషియా ఫిష్‌ను నీరు నిల్వ ఉన్న, నీరు పారే ప్రాంతాల్లో వదులుతున్నాం.

డాక్టర్ ఎస్. భాస్కరరావు, డీఎంహెచ్ఓ

సాంకేతిక పరిజ్ఞానాన్ని పంచుకోవడానికి హ్యాకథాన్

- జేఎన్‌టీయూ జీవీ వీసీ ప్రొఫెసర్ వెంకటసుబ్బయ్య




సత్కారం పొందుతున్న జేఎన్‌టీయూ జీవీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య

విజయనగరం అర్బన్: సాంకేతిక పరిజ్ఞానాన్ని కళాశాల స్థాయిలో పంచుకోవడానికి హ్యాకథాన్ సదస్సులు దోహదపడుతుందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య అన్నారు. స్థానిక జేఎన్‌టీయూ జీవీ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం ఇన్‌క్యుబేషన్ సెంటర్ సంయుక్తంగా 'హ్యాక్‌థాన్ 2కె23 ఇన్నోఎక్స్‌పో 360' పేరుతో మూడురోజులపాటు నిర్వహిస్తున్న సదస్సును బుధవారం అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో ఎప్పటికప్పుడు వస్తున్న పరిశోధనలపై విద్యార్థులకు అవగాహన కలిగించడానికి ఇలాంటి సదస్సులను కళాశాలలు నిర్వహించాలని సూచించారు. ఆధునిక సాంకేతిక ప్రపంచంలో కంప్యూటర్ ఇంజినీరింగ్ కీలకపాత్ర వహిస్తుందన్నారు. అకడమిక్ ఆడిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు మాట్లాడుతూ పరిశోధనా దృక్పథాన్ని మెరుగు పరచుకోవడానికి విద్యార్థులు నిరంతరం కృషి చేయాలని సూచించారు. అనంతరం ముఖ్యఅతిథిని ఘనంగా సత్కరించారు. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ పి.అరుణకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్, ఇన్నోవేషన్ అండ్ ఇన్‌క్యుబేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి, కో–ఆర్డినేటర్, ఐవీ విభాగాధిపతి డాక్టర్ బి.తిరుమలరావు, ట్రిబుల్ ఈ విభాగాధిపతి డాక్టర్ ఎ.పద్మజ, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ నోరిని, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ సి.నీలిమాదేవి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీచర్ల కొరతకు సర్దుబాటు

- బోధనకు ఆటంకం లేకుండా చర్యలు



బి.లింగేశ్వరరెడ్డి, డీఈఓ

విజయనగరం అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెడుతోంది. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు సీఎం వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డి పలు సంస్కరణలు అమలు చేస్తున్నారు. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం, బైజూస్‌తో వర్చువల్ బోధన, విద్యార్థులకు ట్యాబ్‌ల అందజేత, సీబీఎస్ఈ సిలబస్ అమలు, డిజిటల్ బోధన తదితర నూతన పద్ధతులను అమలు చేస్తున్నారు. తాజాగా విద్యార్థుల బోధనకు ఆటంకం లేకుండా టీచర్ల కొరత ఉన్న పాఠశాలలను గుర్తించి ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 359 మంది వివిధ కేటగిరి ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి బి.లింగేశ్వరరెడ్డి ఉత్తర్వులు విడుదల చేశారు. వారిలో ఎస్‌జీటీలు, స్కూల్ అసిస్టెంట్ టీచర్లు, లాంగ్వేజ్ పండిట్లు ప్రధానంగా ఉన్నారు. ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలను తొలుత గుర్తించి జిల్లా కమిటీ ఆమోదం తెలియజేయడంతో సర్దుబాటుకు మార్గం లభ్యమైంది. . ఉపాధ్యాయులు ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలల నుంచి రిలీవై బదిలీ చేసిన పాఠశాలల్లో వెంటనే చేరాలని డీఈఓ ఆదేశాలు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,789 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 2 లక్షల మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 3 నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులను సమీపంలోని ఉన్నత పాఠశాలలకు బదిలీ చేశారు. 3వ తరగతి నుంచే సబ్జెక్ట్ టీచర్లు బోధిస్తే పై తరగతుల్లో విద్యార్థులు సులువుగా రాణించగలుగుతారని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. దీంతో కొన్ని పాఠశాలల్లో సెకండరీ గ్రేడ్ టీచర్ల కొరత ఏర్పడింది. ఈ సమస్యను అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలో మిగులు ఉపాధ్యాయుల నుంచి కొరతకు సరిపడే సంఖ్యలో మాత్రమే ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను విద్యాశాఖ చేపట్టింది.



తరగతి గదిలో విద్యార్థులు

359 మంది టీచర్ల సర్దుబాటు

ప్రభుత్వ పాఠశాలల్లో మిగులు ఉన్న ఉపాధ్యాయులను కొరత ఉన్న పాఠశాలలకు బదిలీ చేసే విధంగా కసరత్తు చేశారు. జూలై నెలాఖరు నాటి విద్యార్థుల నమోదు నిష్పత్తి ఆధారంగా ఉపాధ్యాయుల కొరతను లెక్కకట్టారు. దాని ప్రకారం జిల్లా వ్యాప్తంగా మొత్తం 359 మంది టీచర్ల కొరత ఉన్నట్లు గుర్తించారు. సర్దుబాటు చేసిన ఉపాధ్యాయులలో ఎస్‌జీటీ కేటగిరిలో 54 మంది, మిగిలిన వారిలో సబ్జెక్టు టీచర్లు బయాలజీ–56, ఆంగ్లం–50, హిందీ–19, గణితం–53, భౌతికశాస్త్రం–32, సాంఘిక శాస్త్రం–84, తెలుగు11 ఉన్నాయి. సర్దుబాటు చేసిన వారిలో దాదాపు అన్ని సబ్జెక్టుల టీచర్లు ఉన్నారు.

వెంటనే విధుల్లో చేరాలి

సర్దుబాటు చేసిన ఉపాధ్యాయులు ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలల నుంచి వెంటనే రిలీవ్ అయి కొత్త పాఠశాలల్లో చేరాలని డీఈఓ ఆదేశించారు. విద్యార్థులకు బోధనలో ఇబ్బందులు లేకుండా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

SAKSHI · SAKSHI DIGITAL MEDIA GROUP · ఆంధ్రప్రదేశ్ ANDHRA PRADESH · AP Pollution Control Board

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతిసిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం ..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకురావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా:

గర్ల్స్ హైస్కూల్, ఆపోజిట్ జూనియర్ కాలేజ్, బెలగాం, పార్వతీపురం

తేది : 16-09-2023 (శనివారం)

సమయం : ఉ. 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.

రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన ఫోన్ నంబరు : 96761 94128, 90102 04441

నేడు జాతీయభాష దినోత్సవం



నేడు హిందీ దివస్

రాజాం: వివిధ సంస్కృతులు, విభిన్న భాషలు, విభిన్నమైన నాగరికతలకు నెలవు భారతదేశం. దేశంలోని ప్రతి రాష్ట్రానికి ఒక ప్రాంతీయ భాష ఉంది. అంతేకాదు ఒకే రాష్ట్రంలో కొన్ని గిరిజన ప్రాంతాలకు వెళ్తే అక్కడివారి భాష మరోలా ఉంటుంది. ఆయా వర్గాల వారు మరొకరితో మాట్లాడుకునేందుకే అనుసంధానంగా వ్యవహరించేందుకు ఒక భాష అవసరం. అటువంటిదే జాతీయ భాష హిందీ. అన్ని రాష్ట్రాలను, కేంద్రపాలిత ప్రాంతాలను ఏకంచేసి, రాజభాషగా ముద్రవేసుకున్న జాతీయభాషకు రోజురోజుకు ఆదరణ పెరుగుతోంది. సెప్టెంబర్ 14వ తేదీకి హిందీ దివస్‌ను దేశం మొత్తం జరుపుకోంటుంది. హిందీ భాషా దినోత్సం సందర్భంగా పలు పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాస రచన, క్విజ్, డిబేట్లు, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందిస్తారు. ఈ ఏడాది వారం రోజులపాటు జాతీయ భాష దినోత్సవాలను నిర్వహిస్తున్నారు.

పెరుగుతున్న ఆదరణ..

రెండు తెలుగు రాష్ట్రాల్లో హిందీ అధ్యయనం కోసం ఎన్నో భాషా ప్రచార సంస్థలు వివిధరకాల కోర్సులు అందిస్తున్నాయి. ఎంతోమంది విద్యార్థులను హిందీ భాషలో ప్రావీణ్యులుగా తీర్చిదిద్ది ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాయి. పదోతరగతిలో హిందీ సబ్జెక్ట్‌లో ఎక్కువ మార్కులు వచ్చినవారికి డిఫెన్స్ ఉద్యోగావకాశాలు అధికంగా ఉన్నాయి.



కె.మధుసూదనరావు

హిందీ భాషాభివృద్ధిలో ప్రచారక్‌లు..

హిందీభాషాభివృద్ధి కార్యక్రమాల్లో ప్రచారక్‌లు ఎనలేని సేవలు అందిస్తున్నారు. ప్రతి నియోజకవర్గ పరిధిలో ఒకరి నుంచి ముగ్గురు వరకూ ప్రచారక్‌లు వివిధ సంస్థల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో హిందీ ప్రాథమిక స్థాయి నుంచి ప్రవీణ వరకూ కోర్సులు నిర్వహిస్తున్నారు. ఎంతో మంది హిందీ భాషోపాధ్యాయులను, విద్వాంసులుగా తీర్చిదిద్దుతున్నారు. నిరుద్యోగులను ఉద్యోగులుగా మార్చుతున్నారు.

16 ఏళ్ల నుంచి ప్రచారక్‌గా

నాకు ప్రభుత్వ ఉద్యోగం రాకముందునుంచే హిందీ ప్రచారక్‌గా వ్యవహరిస్తున్నాను. నేను ప్రతి ఏడాదీ హిందీ పండిట్‌గా పనిచేస్తున్న పాఠశాల ద్వారా హిందీ ప్రచార సభ ద్వారా విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నాం. పది తరువాత కళాశాలకు వెళ్లి చదవలేని విద్యార్థులు ఈ కోర్సుల ద్వారా ఉన్నత చదువులు పూర్తిచేస్తూ ఉద్యోగాలు పొందుతున్నారు. గత 16 ఏళ్లుగా హిందీ ప్రచార సభలు నిర్వహిస్తున్నాను.

కె.మధుసూదనరావు, హిందీ ప్రచారక్, రాజాం

ఆహార కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు



కిరాణా షాపులో తనిఖీ చేస్తున్న జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రామయ్య

వీరఘట్టం: ఆహార కల్తీకి పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పార్వతీపురం మన్యం జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వై.రామయ్య హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఆయన వీరఘట్టం మండల కేంద్రంలోని పలు కిరాణా షాపుల్లో తనిఖీ చేసి ప్రజలకు నాణ్యమైన సరుకులు విక్రయించాలని సూచించారు.ఎవరైనా కల్తీ వస్తువులు విక్రయిస్తే షాపుల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు క్రిమినల్ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం కొన్ని షాపుల్లో శాంపిల్స్ తీశారు. అలాగే హోటళ్లలో రుచికరమైన టిఫిన్,భోజనాలు విక్రయించాలని,నిల్వ ఉంచిన పదార్థాలను విక్రయించకూడదని హితవు పలికారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380-00
బంగారం(22సి. 10గ్రా.)	55,350-00
వెండి (కిలో)	80,000-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹152	₹274	₹ 284